నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని ఇటిక్యాల స్టేజి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. లారీ, ట్రాక్టర్, ఆటో ఒకదానికి ఒకటి ఢీకొని రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాలివాన బీభత్సం

నవతెలంగాణ-ఉట్నూర్

శనివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు ఇండ్ల పైకప్పులు లేచిపోయాయి. ఈ క్రమంలో నర్సాపూర్ జైత్రం తండాలో ఇంటి పైకప్పు రేకులు లేచి ఉపరి సంతోష్‌పై పడడంతో గాయాలయ్యాయి. గాలి వానతో నష్టపోయిన సంతోష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి స్థానికులు కోరారు. గాయపడిన సంతోష్‌ను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.



ప్రయాణం..ప్రాణసంకటం..!

- కిందటేడాది పలు చోట్ల తెగిపోయిన రోడ్లు, కల్వర్టులు
- తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టిన అధికారులు
- ఈ ఏడాది భారీ వరదలొస్తే కొట్టుకుపోయే పరిస్థితి
- వాగులు దాటలేక..రోడ్లు లేక రాకపోకలకు అంతరాయం
- ఉమ్మడి జిల్లాలో ఏండ్లుగా జనానికి తప్పని బాధలు
- కొత్త ప్రభుత్వం దృష్టిసారించాలని వేడుకోలు

ఇచ్చోడ మండలంలోని దాబా(బి) గ్రామ సమీపంలో గతేడాది వరదల కారణంగా కొట్టుకుపోయిన రహదారి ఇది. రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక రైతు, అధికారులు తాత్కాలికంగా మొరం వేసి రాకపోకలు పునరుద్ధరించారు. కానీ ఈ ఏడాది కూడా అదే స్థాయిలో వరదలు వస్తే మళ్లీ రాకపోకలు నిలిచేపోయే పరిస్థితి కనిపిస్తోంది.



సిరికొండ మండల కేంద్రం నుంచి ఇచ్చోడకు వెళ్లే దారి ఇది. గతేడాది వరదలకు వంతెన కోతకు గురికావడంతో కొన్ని రోజుల పాటు ఈ రహదారి గుండా రాకపోకలు నిలిచిపోయాయి. కేవలం మట్టివేసి చేతులు దులుపుకొన్నారు. మళ్లీ వర్షం వస్తే రోడ్డు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని అటువైపు వెళ్తున్న ప్రయాణికులు చెబుతున్నారు.



ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ(జి)కి వెళ్లే దారిలో ఉన్న వాగు ఇది. ప్రతి ఏటా వర్షాలకు పొంగిపొర్లడంతో అటువైపు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. అత్యవసర సమయంలోనూ బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఈ వాగుపై వంతెన నిర్మించి రహదారి సౌకర్యాన్ని బాగు చేయాలని అటువైపు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వానొచ్చనంటే..వరదొస్తది..అనేది సినిమా పాటనే కాదు..నిజ జీవితంలోనూ వరదల కారణంగా ఉమ్మడి జిల్లావాసులు నరకయాతన ఎదుర్కొంటున్నారు. ఏటా సంభవిస్తున్న వరదల కారణంగా రోడ్లు తెగిపోయి..కల్వర్టులు కూలిపోయి ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతోంది. అటవీ ప్రాంతం..అందులోనూ మారుమూల ప్రాంతాలు అధికంగా ఉండటం కారణంగా చిన్నపాటి వర్షానికి కూడా వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించడం కారణంగా వాగులు దాటలేక ఇబ్బందులు పడుతుంటే..వాగులు దాటేందుకు ప్రయత్నించిన కొందరు వరద ఉధృతికి కొట్టుకుపోయి మృత్యువాత పడుతున్నారు. అనేక చోట్ల వాగులపై వంతెనలు, కల్వర్టులు లేకపోవడం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మరోపక్క కిందటేడాది తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకోవడంతో ప్రస్తుతం పరిస్థితి ఏంటనే భయాందోళన ఆయా గ్రామాల ప్రజల్లో వ్యక్తమవుతోంది.

ఆదిలాబాద్ గ్రామీణ మండలం అంకోలి సమీపంలో కొన్నేండ్ల క్రితం నిర్మించిన వంతెన ఇది. వాగు పరిమాణానికి సరిపడా నిర్మించకపోవడంతో ఒక్కసారిగా వరద వచ్చిన సమయంలో ఈ బ్రిడ్జికి రెండు వైపులా మట్టి గండిపడటంతో అటువైపు గ్రామాలైన సిరికొండ, పందిర్లొద్ది తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. కిందటేడాది కుట్టుకుపోయిన ప్రాంతంలో మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కానీ అధిక వరద వస్తే మాత్రం మళ్లీ కిందటేడాది పరిస్థితి పునరావృతం కానుందని అటువైపు గ్రామాల వారు చెబుతున్నారు.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వర్షాకాలం రాగానే ఉమ్మడి జిల్లావాసుల్లో ఒక రకమైన భయం ఉంటుంది. వ్యవసాయానికి అనుకూలమైనప్పటికీ.. భారీ వరదలు సంభవిస్తే అదే స్థాయిలో నష్టం జరుగుతోంది. కిందటేడాది ఎడతెరిపి లేని అధిక వర్షాల కారణంగా చిన్నా..పెద్ద వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. పెన్‌గంగా, ప్రాణహిత, గోదావరితో పాటు పెద్దవాగు, సాత్నాల వంటి వాగులతో పాటు గ్రామాలకు వెళ్లే దారిలో అనేక వాగులు ఉధృతంగా ప్రవహించడం కారణంగా అనేక చోట్ల వాగులపై నిర్మించిన వంతెనలు, కల్వర్టులు కొట్టుకుపోవడంతో పాటు పలు చోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. ఆ సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నష్టం అంచనా వేసిన అధికారులు రూ.కోట్లతో నష్టం వాటిల్లిందని ప్రతిపాదనలు పంపించారు. కానీ అప్పటి ప్రభుత్వం కేవలం తాత్కాలిక మరమ్మతుల కోసమే నిధులు విడుదల చేసిందని అధికారులు చెబుతున్నారు. దీంతో అక్కడక్కడ తెగిపోయిన రోడ్లపై కేవలం మట్టి, మొరం వేయడం, కూలిపోయిన కల్వర్టుల వద్ద ఇదే రీతిన పనులు చేపట్టి చేతులు దులుపుకొన్నారు.కొన్ని చోట్ల అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులే బాగు చేసుకున్న సందర్భాలున్నాయి. కానీ శాశ్వత ప్రతిపాదికన పనులు చేపట్టకపోవడంతో మళ్లీ వరదలు వస్తే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీంతో జనాలు ఇప్పట్నుంచే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంతెనలు, రోడ్లు లేక అవస్థలు..!

ఉమ్మడి జిల్లా విశాలంగా ఉండటం.. అటవీ ప్రాంతం, మారుమూల ప్రాంతాలు అధికంగా ఉండటం కారణంగా వాగులు,వంకలు సైతం అదే సంఖ్యలో ఉన్నాయి. ఇప్పటికే గత ప్రభుత్వాలు కొన్ని చోట్ల వాగులపై వంతెనలు, కల్వర్టులు నిర్మించిన రాకపోకలు సులభతరం చేసినా..ఇంకా అనేక చోట్ల వంతెనలు లేకపోవడంతో వాగులు దాటలేక జనాలు ప్రాణాలు కోల్పోతున్నారు.

ముఖ్యంగా గర్భిణీల అవస్థలు అంతా ఇంత కావు. ప్రసవానికి పక్షం రోజుల ముందే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరోపక్క ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా..వాగులు దాటలేక ఆస్పత్రులకు సకాలంలో వెళ్లలేక ప్రాణాలు పోతున్న సందర్భాలున్నాయి.

కొత్త ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టిసారించి వంతెనలు, రోడ్ల కోసం నిధులు మంజూరుచేయడంతో పాటు శాశ్వత ప్రతిపాధికన పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రజక వృత్తిదారులకు రూ.10లక్షల సహకారం అందించాలి

- ప్రభుత్వ హామీని అమలు చేయాలి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వ హామీ మేరకు రజక వృత్తిదారులకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సమావేశం తంగళ్లపల్లి వెంకటేష్ అధ్యక్షతన శనివారం బీసీ భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆశయ్య ముఖ్యాతిథిగా మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలో ప్రతి వృత్తిదారుడికి రూ.10లక్షల ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు రూ.10కోట్లతో మోడ్రన్ దోబీ ఘాట్ల నిర్మాణానికి హామీ ఇచ్చారని, వాటికి వెంటనే అమలు చేయాలని కోరారు. వీటితో పాటు ఉచిత విద్యుత్ పథకాన్ని ఎల్‌టీ 4లో చేర్చాలని, ప్రమాదాలకు గురై మరణించిన ప్రతి వృత్తిదారుడికి ఐదు లక్షల బీమా పథకం ప్రవేశపెట్టాలని జిల్లా కమిటీ తీర్మానించింది. జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు మాట్లాడుతూ 6 గ్యారంటీలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం రజకులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ముష్కర చందు, తరిగొప్పుల భాగ్య, దురిశెట్టి రాములు, నడిగోటి తిరుపతి, రమేష్, రజిత, చంద్రగిరి రమేష్, జాలిగం రాజేశ్వరి, కొండపర్తి బాపు, కంచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

300 మంది పోలీసులతో గ్రూప్-1 పరీక్ష



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష పట్టణంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, 300 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ఎస్పియు భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాల వద్ద విధులను నిర్వర్తించుచున్న సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణంలో ఆదివారం 18 కేంద్రాల వద్ద 6,729 అభ్యర్థులు పరీక్షను రాయనున్నారని, పరీక్ష కేంద్రాల వద్ద సిఐ, ఎస్సై స్థాయి అధికారులను ఇన్‌చార్జీలుగా నియమించి, ప్రతి కేంద్రం వద్ద పదిమంది సిబ్బందిని కేటాయించామని తెలిపారు. పట్టణంలో నాలుగు రూట్లలో ప్రత్యేక అధికారులను నియమించి నిరంతరం పర్యవేక్షించే విధంగా బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులను నిర్వర్తించాలని సూచించారు. పరీక్షా కేంద్రం లోపలికి వెళ్లే సమయంలో అభ్యర్థులు ప్రతి ఒక్కరిని పరిశీలిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లకు అనుమతి లేదని, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను, వాచ్‌లను పరీక్షా కేంద్రంలోనికి పంపకూడదని తెలియజేశారు. సిబ్బంది అందరూ ఉదయాన్నే పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరిశీలించాలన్నారు. 10గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోనికి అనుమతించకూడదని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ర్యాలీలు, సభలు నిర్వహించకుండా, అనవసరంగా గుంపులు గుంపులుగా తిరగకుండా, పట్టణంలోని సిఐలు పరీక్ష పూర్తి అయ్యేంతవరకు గస్తీ నిర్వహిస్తూ పర్యవేక్షిస్తుండాలని తెలియజేశారు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల జిరాక్స్ షాపులను మూసి వేయించాలని తెలియజేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన హాల్ టికెట్ వెనకాల ఉన్న నియమ నిబంధనలు పాటించవలసిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పరిపాలన బి.సురేందర్‌రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్.జీవన్‌రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పట్టణ సిఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో ట్రైనీ మేనేజ్మెంట్ ఉద్యోగాల ఖాళీల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జైపూర్

సింగరేణిలో ట్రైనీ మేనేజ్మెంట్ ఉద్యోగాల భర్తీకి అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జీఎం పర్సనల్ డిపార్ట్మెంట్ ప్రకటన విడుదల చేసింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నుండి మార్చి 15న విడుదల చేసిన నోటిఫికేషన్ నెంబర్.02/2024 ద్వారా ట్రైని మేనేజ్మెంట్ ఉద్యోగ ఖాళీలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఇందుకు సంబంధించి మే 15 నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానించగా సాంకేతిక కారణాల వల్ల దరఖాస్తుల ఆహ్వానం వాయిదా పడింది. సాంకేతిక సమస్య పరిష్కరించి తిరిగి అర్హులైన వారి నుండి ఈ నెల 10న మధ్యాహ్నం 12 గంటల నుండి తిరిగి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటనలో పేర్కొంది. దరఖాస్తుల ఈ నెల 26 సాయంత్రం 6గంటల వరకు అవకాశం కల్పిస్తూ ట్రైనీ మేనేజ్మెంట్ ఈఅండ్‌ఎం, మేనేజ్మెంట్ ట్రైనీ సిస్టమ్స్, జేఎంఈటి అసిస్టెంట్ ఫోర్‌మెన్, ట్రైనీ ఎలక్ట్రికల్, అసిస్టెంట్ ట్రైనీ మెకానికల్ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ ట్రైనీ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరింది.

వ్యాపార విస్తరణతో సింగరేణి భవిష్యత్తుకు భద్రత

- ఆధునిక సాంకేతిక సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి
- భవిష్యత్తులో 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్

బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా రానున్న రోజుల్లో వ్యాపార విస్తరణతో సింగరేణి భవిష్యత్తుకు భద్రతపై యామాజ్యం దృష్టి సారించింది. ఇంత కాలం భూగర్భ బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సాధిస్తుండగా ముమ్మందు ఆధునిక సాంకేతికతో సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. పోటీ మార్కెట్‌లో నిలదొక్కుకోవడంతో పాటు సింగరేణి భవిష్యత్ దృష్ట్యా అధికారులు, కార్మికులు, ఉద్యోగులు పని గంటలను సద్వినియోగపర్చాలని ఇటీవల సీఎండీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు శాఖ నిర్వహించే వేలం పాటల్లో పాల్గొని రాష్ట్రంలో గల బొగ్గు బ్లాకులతో పాటు వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర రాష్ట్రాల్లోని బొగ్గు బ్లాకులను కూడా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశానిర్దేశం చేసిందని వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బొగ్గు బ్లాకు ద్వారా త్వరలో ఉత్పత్తిని ప్రారంభించనుండగా ఏడాదికి కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించే అవకాశం ఉన్నట్లు యాజమాన్యం భావిస్తోంది.



నవతెలంగాణ-జైపూర్

దేశంలో అనేక ప్రభుత్వ, ప్రయివేట్ సంస్థలు వ్యాపార విస్తరణ చర్యలు చేపడుతున్నందున సింగరేణి సంస్థ కూడా బొగ్గు ఉత్పత్తికి మాత్రమే పరిమితమై కాకుండా ఇతర రంగాల్లో కూడా ప్రవేశించాలని భావిస్తోంది. థర్మల్, సోలార్ విద్యుత్ రంగాలతో పాటు ఇనుము, రాగి తదితర ఖనిజ ఉత్పత్తులు చేపట్టాలని, ఆఫ్రికా ఖండంలో గల వివిధ దేశాల్లో గనులను చేపట్టడంపై దృష్టి సారించింది. అదేవిధంగా జైపూర్‌లో నెలకొల్పిన 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో మరో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది.

నైనీ బొగ్గు బ్లాకుకు అనుబంధంగా పిట్ హెడ్ థర్మల్ పవర్ ప్లాంట్

ఓడిశాలో గల నైనీ బ్లాకు అనుబంధంగా సింగరేణి యాజమాన్యం 1600 మెగావాట్ల పిట్ హెడ్ థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న థర్మల్ విద్యుత్‌తో కలిపి సింగరేణి మొత్తంగా 3,600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలని భావిస్తోంది. అదేవిధంగా ప్రస్తుతం చేపట్టిన 300 మెగావాట్ల సోలార్ విద్యుత్‌కు తోడు 232 మెగావాట్ల గ్రౌండ్ మౌంటెడ్ సోలార్ ప్లాంట్ నిర్మాణం, లోయర్ మానేరు డ్యాంపైన 300 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్, అదేవిధంగా మల్లన్న సాగర్‌పై మరో 500 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయడంపై దృష్టి సారించింది. దీనికి తోడు రాజస్థాన్ రాష్ట్రంలో మరో 500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ విషయంలో ఇప్పటికే సంస్థ ఏర్పాటు చేసిన ఏజెన్సీ సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సింగరేణి సంస్థ 3000 మెగావాట్ల థర్మల్ విద్యుత్‌తో పాటు 2000 మెగావాట్ల సోలార్ విద్యుత్ రాష్ట్ర, దేశ అవసరాలకు అందించడానికి సమాయత్తమవుతోంది.

సాంప్రదాయేతర విద్యుదుత్పత్తి ప్రాజెక్టులతో...

థర్మల్, సోలార్ విద్యుత్ ఉత్పత్తితో పాటు మరో అడుగు ముందుకేసి అత్యాధునిక సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల వైపు దృష్టి సారించింది. పంపుడ్ స్టోరేజ్ ప్రాజెక్టు అనే పద్ధతి ద్వారా ఇల్లందులో మూతబడిన జేకే ఓసీ సంపులోని నీటిని వినియోగిస్తూ 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ప్రయత్నిస్తుండగా ఎత్తైన ఓపెన్ కాస్ట్ డంపులు, కొండలు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో విండ్ ఎనర్జీ(గాలి మరల ద్వారా విద్యుత్ ఉత్పాదన) ప్లాంట్లను కూడా ఏర్పాటు చేయాలని భావిస్తోంది. అందుబాటులో గల మూడు నాలుగు ప్రదేశాలలో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట ఏర్పాటుకు నిర్ణయించుకుంది. అదేవిధంగా మణుగూరు ప్రాంతంలో గల పగిడేరు వద్ద భూగర్భంలో ఉన్న వేడి నీటి వనరులను ఉపయోగించి ప్రయోగాత్మకంగా జియో థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంస్థ సఫలమైన ఫలితాలు కనబర్చితే మణుగూరు, పగిడేరు తదితర ప్రాంతాల్లోని భూగర్భంలో ఉన్న ఉష్ణ జలాలను వినియోగించి 200 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదనకు అవకాశాన్ని పరిశీలిస్తోంది. ఈ విధంగా బొగ్గు ఉత్పత్తికి మాత్రమే పరిమితం కాకుండా వ్యాపార విస్తరణతో భవిష్యత్ భద్రతపై యాజమాన్యం దృష్టి సారించింది.







నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

జైలును సందర్శించిన ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని జిల్లా జైలును ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలకు అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పారిశుధ్యం తీరును పరిశీలించారు. ఈ మేరకు సిబ్బందితో మాట్లాడారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ పాల్గొన్నారు.



మీ సేవను తనిఖీ చేసిన ఈడీఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తాంసి బస్టాండ్ వద్ద మీసేవ సెంటర్‌ను కలెక్టరేట్ ఈడీఎం రవి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మీసేవ సాంక్షన్ అలాట్ చేసిన స్థలంలోనే మీసేవ నడిపించాలని, అదేవిధంగా స్టేషనరీ రిజిస్టరు కచ్చితంగా అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. మీసేవ అందిస్తున్న ఆపరేటర్లు సర్వీసులు ఇవ్వకుండా జీరో ట్రాన్‌జక్షన్స్ అయి ఉంటే వాటిపైన రాష్ట్ర కార్యాలయ ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటు

- జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో సంతాపం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్షర యోధుడు, ఈనాడు, ఈటీవీ సంస్థల అధినేత రామోజీరావు మరణించడం పత్రిక రంగానికి తీరని లోటని జర్నలిస్ట్ జేఏసీ కన్వీనర్ నూకల దేవేందర్ అన్నారు. జర్నలిస్ట్ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి, ఆయనకు శాంతి కలగాలని కోరారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ రామోజీరావు పత్రిక రంగంలో విలువలు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారని కొనియాడారు. ఎల్లప్పుడూ సమాజహితం కోసమే పరితపించారని గుర్తు చేశారు. అనేక మంది జర్నలిస్టులను తయారు చేశారని తెలిపారు. ఆయన మరణించడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జేఏసీ కోకన్వీనర్ బీర్యాకర్‌వార్ వెంకటేష్, జర్నలిస్టులు కందుల మహేందర్, మేడపట్ల సురేష్, సారంగపాణి, నరేష్, గంట వినోద్, అల్కె అశోక్, రవీందర్, భేగ్, సంద సురేష్, మోయిజ్, రాజేష్, గోపి, నర్సింగ్, డీ.దీపక్, అజయ్, మహేందర్, వినోద్, నీలేష్, గాజరి శ్రీకాంత్, కిరణ్, అస్మత్ అలీ, అజయ్, కిరణ్ రెడ్డి, రాము, అభిలాష్, కిజార్ యాఫై, అమీమ్ షరీఫ్ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకుంటున్నారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో పలువురు కక్షిదారులు రాజీద్వారా కేసులు పరిష్కరించుకోగా, వారికి రాజీ పత్రాలను న్యాయమూర్తులు, ఎస్పీ గౌస్ ఆలంతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి అందించారు.

రాజీమార్గం ద్వారా త్వరగా సమస్య పరిష్కారం..

ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకుంటే ఇద్దరు కక్షిదారుల గెలుపవుతుందన్నారు. కేసుల సంఖ్యలను తగ్గించేందుకు గాను ప్రతి మూడు నెలలకు ఒకసారి లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని, కక్షిదారులు కూడా పెద్ద సంఖ్యలో వారి కేసులను పరిష్కరించుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా సైబర్ క్రైమ్ కేసుల పట్ల పోలీసులు, న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్‌తో కేసులు పరిష్కరించుకున్న వారికి కోర్టు ఫీజులు కూడా తిరిగి చెల్లిస్తామని స్పష్టం చేశారు.

సైబర్ బాధితులకు న్యాయం చేస్తాం...

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ బాధితులకు సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నారని తెలిపారు. కక్షిదారులు కోర్టుల చుట్టు తిరగకుండా త్వరగా రాజీ ద్వారా పరిష్కరించేలా అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. ఈ సారి సైబర్ నేరాల కేసులు కూడా వస్తున్నాయని, వీటిపై నిఘా పెట్టి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య, న్యాయమూర్తులు శివరాంప్రసాద్, ప్రమీల జైన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ నవతెలంగాణతో మాట్లాడారు. ప్రతి ఏడాది ప్రభుత్వం బాలబాలికలకు ఉచిత యూనిఫామ్, కాపీలు, పెన్నులు, పుస్తకాలను ఐటీడీఏ టీడీఓ పాయింట్ నుంచి ప్రతి ఆశ్రమ పాఠశాలకు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ ఏడాది ఇప్పటికే 70 శాతం పుస్తకాలు పాఠశాలలకు చేరాయి. భోజనం మెనూ ప్రకారం మూడు పూటలు అందిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో బోధనలు జరుగుతాయని తెలిపారు. ఉపాధ్యాయులకు కొన్ని రోజులుగా శిక్షణ ఇచ్చి విద్యార్థులు ఎలా బోధించాలో తెలియపరుస్తున్నామని అన్నారు. విద్యార్థులు భయపడకుండా ఇంగ్లీష్‌లో చదవడం రాయడం వచ్చే విధంగా తయారు చేసి, గత సంవత్సరం కంటే ఎక్కువ మార్కులు వచ్చే విధంగా హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు చూసుకోవాల్సిన బాధ్యతలు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు అధికారి చొరవతో కేబీ కాంప్లెక్స్‌లోని పీఎమ్మార్సీలో పదో తరగతి పిల్లల ఫలితాలపై కార్యాచరణ చేపడుతున్నారు. డ్రై అండ్ డేలో భాగంగా పాఠశాల ఆవరణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతి ఆశ్రమ పాఠశాలలో ఈనెల 6 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీని ద్వారా గ్రామాల్లో తిరిగి ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నారు. గత సంవత్సరం మోడల్ పాఠశాలగా మార్చిన ఆశ్రమ పాఠశాలను ఈ విద్య సంవత్సరం ఆశ్రమ పాఠశాల లాగే కొనసాగించనున్నట్టు అధికారులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1200 గిరిజన అవాసాలు ఉన్నాయి. బాలికలకు నెల ఖర్చులు రూ.120, బాలురకు రూ.70 చెలిస్తున్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పోషకులతో సమావేశం నిర్వహించి, పాఠశాలలో పిల్లలను పంపించే విధంగా ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి ఒక్క విద్యార్థికి పాఠశాలకు పంపించే విదంగా చూడాలని ఐటీడీఏ అధికారులు, ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు.



ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్

అనేక వ్యాధుల నిర్మూలనకు పురాతన ఆయుర్వేద వైద్యం

- ఉచిత ఆయుర్వేద గుళికలు పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అనేక వ్యాధుల నిర్మూలనకు పురాతన ఆయుర్వేద వైద్యం దోహదం చేస్తుందని, వైద్యుడు యువరాజ్ వైద్య అన్నారు. ఉబ్బసం, ఆయాసం, అస్తమా వ్యాధులతో బాధపడుతున్న వారిని రోగం నుంచి విముక్తులను చేసే లక్ష్యంతో గత 25 ఏండ్లుగా మృగశిర కార్తె రోజున ఆయుర్వేద గుళికలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. శనివారం పట్టణ శివారులోని సీసీఐ క్రాస్ రోడ్డు వద్ద గల వైద్య ఆయుర్వేదిక్ రిసెర్చ్ సెంటర్‌లో గుళికల మందు పంపిణీ చేపట్టారు. పట్టణంతో పాటు పరిసరాల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున జనాలు వచ్చి మందును తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ యువరాజ్ వైద్య మాట్లాడుతూ ఉబ్బసం, అస్తమా వ్యాధుల నుంచి విముక్తి చేయడంతో పాటు రోగ నిరోధక శక్తి పెంచేలా గుళికలమందును పంపిణీ చేస్తున్నామన్నారు. ఇది పూర్తి ఆయుర్వేదమని దీని వల్ల ఎలాంటి నష్టలు ఉండవని అన్నారు. ప్రతి ఏటా మృగశీర కార్తే నాడు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వస్తుందని తెలిపారు.

నేడే గ్రూప్-1 పరీక్ష.. నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్ వన్ ప్రిలిమినరీ పరీక్షకు పూర్తి ఏర్పాట్లు చేశామని పరీక్షల రిజినల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం పట్టణంలో జరిగే పరీక్షకు సంబంధించిన కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కేంద్రాల వద్ద కల్పించిన సౌకర్యాలను తెలుసుకుంటూ పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆదివారం జరిగే పరీక్షకు 6 వేల 729 మంది హాజరుకానుండగా వారి కోసం 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో పాటు ఎండల తీవ్రత నేపథ్యంలో వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. ఉదయం 10.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరగనుంది.

8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలి..

ఈ సందర్భంగా పరీక్షల ఆర్‌ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ పరీక్షకు వచ్చే అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. నిమిషం ఆలస్యం నిబంధన ఉన్నందున కేంద్రాలకు త్వరగా చేరుకోవాలన్నారు. హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డు, పెన్నులు తప్ప వేరే వాటిని లోనికి అనుమతి ఉండదన్నారు. 8 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు ఉంటుందని, పది గంటల నుంచి హాజరు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ జానకి షర్మిల



నవతెలంగాణ-లోకేశ్వరం

లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌ను నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులపై ఆరా తీస్తూ, పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో తిరిగి, పరిశుభ్రతపై తగు సూచనలు చేశారు. సిబ్బంది పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ఏ సమయంలోనైనా తనిఖీలు చేపడతారని తెలియజేశారు. భైంసా ఏఎస్పీ క్రాంతిలాల్ సుభాష్ పాటిల్, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ తనిఖీ చేశాకే పర్మిషన్ ఇవ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలల్లో ఉన్న బస్సులకు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు ఫిట్నెస్ తనిఖీ చేసి, బస్సులకు పర్మిషన్ ఇవ్వాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎర్రజి హరీశ్, మడావి గణేష్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పలు విద్యాసంస్థల్లో విద్యా సంవత్సరం ప్రారంభం కాక ముందే పాఠ్యపుస్తకాలు, టై, బెల్ట్, షూస్, సాక్స్ యూనిఫాంలు ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు షూస్ బెల్ట్ అమ్మరాదని, సర్క్యులర్ వచ్చిన కూడా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి, ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలల వాళ్లు అమ్ముతున్నారని అన్నారు. అయినా కూడా డీఈఓ చూస్తూ కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని అన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారి ఎం.నాగేందర్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మారుతి పాల్గొన్నారు.

పారదర్శకంగా హోంగార్డుల బదిలీ ప్రక్రియ

- జిల్లాలో 97 హోంగార్డుల బదిలీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పారదర్శకంగా హోంగార్డుల బదిలీ ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. శనివారం పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో బదిలీ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో ప్రతి సంవత్సరం హోంగార్డుల బదిలీ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అందులో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి 62 హోంగార్డులు అదేవిధంగా కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా నుండి 35 మంది హోంగార్డులు ఆదిలాబాద్ జిల్లాకు రానుండగా వారి స్థానంలో ఆదిలాబాద్ జిల్లా నుంచి మొత్తం 97 మంది హోంగార్డులను లక్కీ లాటరీ విధానం ద్వారా బదిలీ ప్రక్రియను నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సాధారణ విధులు నిర్వర్తించే హోంగార్డులు, వాహన డ్రైవర్స్, దోబీలు, వంట పని చేసే వారు, వివిధ రంగాలలో విధులు నిర్వహిస్తున్న మొత్తం 97 మందిని నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఇద్దరిని ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించినట్టు తెలియజేశారు. బదిలీ ప్రక్రియను అందరూ హోంగార్డుల నడుమ పారదర్శకంగా ఎటువంటి అపోహలు లేకుండా నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీలు ఎల్ జీవన్‌రెడ్డి, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్, టి.మురళి, చంద్రశేఖర్, పోలీసు కార్యాలయం సిబ్బంది సూపరింటెండెంట్ సంజీవ్, సిబ్బంది, హోంగార్డ్ యూనిట్ అధికారులు రమేష్, రిజర్వు సబ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఈతల పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్లో ఆదివారం ఈతల పోటీలను నిర్వహించనున్నట్టు కోచ్ కోమ్ము కృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి శిక్షణలు ముగింపు సందర్భంగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఆయా వయస్సుల విభాగాల వారీకి పోటీలను నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. విత్ ట్యూబ్, విత్ అవుట్ ట్యూబ్‌లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటలోపల స్విమ్మింగ్‌పూల్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ఫీజు వంద రూపాయలు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా ఇక్కడ ప్రతిభకనబర్చిన వారు ఈనెల 23న నిర్వహించే జూనియర్, సబ్ జూనియర్ విభాగాలకు టైమింగ్ ప్రకారం ఎంపికయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని దుర్గానగర్ గ్రామంలో పిడుగుపాటుతో మృతి చెందిన జాదవ్ కృష్ణ(14), తల్లిదండ్రులు జాదవ్ సరిత పండిత్‌లను శనివారం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డిలు పరామర్శించి ఓదార్చారు. ప్రకృతి వైపరీత్యంతో బాలుడు మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మనోధైర్యాన్ని ఇచ్చారు. వీరి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బొల్లోజి నర్సయ్య, ఎంపీటీసీ ఎస్.వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులు తేజు నాయక్, నాయకులు హాది, మారుతి, కోరువా నవీన్‌రెడ్డి, రేగుంట గంగాధర్, పవార్ రాజు, ధన్ సింగ్, డా. ఈసవేని మనోజ్ యాదవ్, సాయన్న, భీమ్‌రావు, రాజన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటా

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని డోంగర్‌గావ్‌కు చెందిన ఆదివాసీ దంపతులు అనక సంతోష్ స్వప్న ఇటీవల పిడుగు పాటుకు మరణించిన సంఘటన పాఠకులకు విదితమే. శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే బెడ్మ బొజ్జు పటేల్ ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబీకులతో మాట్లాడి మనో ధైర్యానిచ్చారు. తనవంతు సాయంగా రూ.20 వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని, ప్రభుత్వ పరంగా అందాల్సిన వివిధ బెనిఫిట్స్‌ను త్వరలోనే అందజేయడానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీసర్పంచ్ రాథోడ్ రాంచందర్ ఉన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రానికి సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్ వైపు నుంచి రెండు ద్విచక్ర వాహనాలు బాసర కు వెళ్తుండగా ఢీ కొన్నాయి. దీంతో బాసర మండలంలోని బిద్రేల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ తపాలా ఉద్యోగి కామన్న పటేల్(69) అక్కడికక్కడే మృతి చెందాడు. భైంసాకు చెందిన రాహుల్, నారాయణలకు త్రీవ గాయాలు అయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో భైంసాకు తరిలించారు. ఈ రోడ్డు ప్రమాదానికి అతి వేగం, అజాగ్రత్త కారణమని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

రేపు సర్టిఫికెట్ల పరిశీలన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు, హిందీ, మరాఠీ ఉర్దూ, వ్యాయామ ఉపాధ్యాయుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఈనెల 10న జరుపుతున్నట్టు డీఈఓ ప్రణీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈఓ కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు హాజరు కావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వెరిఫికేషన్‌కు అన్ని రకాల విద్యార్హతల సర్టిఫికెట్స్‌తో పాటు సర్వీస్ రిజిస్టర్, ఒక జత జిరాక్స్ కాపీలను తీసుకురావాలని పేర్కొన్నారు.

మూడు రోజుల పాటు రైల్వే గేట్ మూసివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తాంసి బస్ స్టాండ్ వద్ద గల రైల్వే గేటును మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 10 సాయంత్రం 6 గంటల నుంచి, 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు సదరు గేటును మూసి వేస్తున్నట్టు ప్రకటించారు. ట్రాక్ మరమ్మతుల నేపథ్యంలో గేటును మూసే వేయాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి పట్టణవాసులతో పాటు అటువైపు గల గ్రామస్తులు మన్నించి, సహకరించాలని కోరారు.

28న ఛలో హైదారాబాద్

నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ డీఎస్సీ వేసి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తి చేయాలని, జూన్ 28 తలపెట్టే మహాసభకు భారీ ఎత్తున తరలి రావాలని గిరిజన ఆదివాసీ సంఘాల నాయకులు జాదవ్ సుమేశ్ అన్నారు. శనివారం మండలంలోని దేవుగూడ గ్రామంలో డీఈడీ, బీఈడీ పూర్తి చేసుకున్న విద్యార్థులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 28న జరిగే గిరిజన ఆదివాసీ గర్జనకు తరలిరావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ మర్సకోల దేవ్, ఆదివాసీ విద్యార్థి నాయకుడు సోయం దేవ్ ఉన్నారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

ఆదివారం | జూన్ 09, 2024 | www.navatelangana.com

జడ్పీటీసీని సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



లోకసభ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బీజేపీ అభ్యర్థి నగేష్ గెలవడంతో స్థానిక జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావును ఆ పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కేవలం 5000 ఓట్లకు మాత్రమే పరిమితం అయ్యాడని, ప్రస్తుత ఎన్నికల్లో 40,000 పైగా ఓట్లు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో జడ్పీటీసీ పాత్ర ఎంతో ఉందని కొనియాడారు. అనంతరం జడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరు కాపు, యాదవ, దళిత సంఘం నాయకులు గడ్డల సురేష్, సుంకరి పెంటయ్య, అడప సతీష్, ఐలవేని సంతోష్, జయరాజ్, విలాస్ పాల్గొన్నారు.

రామోజీ మరణం మీడియా రంగానికి తీరని లోటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి మీడియా రంగానికి తీరని లోటని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ అన్నారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా రామోజీరావుకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాడు సంస్థల అధినేతగా, అక్షరయోధుడుగా, వ్యాపారవేత్తగా, మీడియా స్థాపకుడుగా, చిత్రనిర్మాతగా, రామోజీ ఫిల్మ్ సిటీ స్థాపకుడుగా పలు రంగాలలో విశిష్ట సేవలందించిన రామోజీరావు మరణం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పాత్రికేయ రంగంలో ఎంతో మందికి ఆయన గుర్తింపు ఇచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సభ్యులు నారాయణ, పూర్ణ, వాహెబ్, కలికోట రమణయ్య, ఎల్లాగౌడ్, పాపయ్య పాల్గొన్నారు.

సేంద్రియ సాగు దిశగా రైతులు

- పశువుల ఎరువులపై మొగ్గు చూపుతున్న రైతులు
- భూసారంతో పాటు పంటల దిగుబడి పెరుగుదల



నవతెలంగాణ-దహెగాం

రసాయన ఎరువులు విచ్చలవిడిగా వినియోగించడం వల్ల పంట చేన్లలో భూసారం దెబ్బతిని తెగుళ్ల ఉధృతి విపరీతంగా పెరిగిపోతుంది. దీంతో దిగుబడి తగ్గిపోవడంతో అన్నదాతలు ఏటేటా అప్పుల్లో కూరుకుపోతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని అన్నదాతలు ప్రత్యామ్నాయంగా ఆలోచిస్తున్నారు. చాలామంది రైతులు గ్రామాల్లో పశువుల పేడ వైపే మొగ్గు చూపుతున్నారు. రైతులు తమ పశువుల ఎరువులను పంట చేన్లలో వేయడంతో పాటు గొర్రెల మందలను పంట చేన్లలో పెట్టుకొని సేంద్రియ ఎరువులను వినియోగించుకోనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పొలాల్లో పశువుల ఎరువు...

మండలంలో భూములున్న రైతులు చాలామంది కౌలుకు ఇస్తుంటే చిన్న, సన్నకారు రైతులు వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నారు. పెద్ద మొత్తంలో పత్తి సాగుచేస్తున్నారు. ఈసారి రైతులు పంట పొలాల్లో సేంద్రియ ఎరువులు వేసేందుకు ముందుకొస్తున్నారు. పంట పొలాల్లో భూసారం పెంపొందించడానికి భీమిని మండలం చిన్నగుడిపేట, పెద్దగుడిపేటలో గ్రామాల్లో పెద్దమొత్తంలో గొర్రెల మందలుండడంతో వాటిని తమ చేన్లలో పెట్టుకుంటున్నారు. రోజుకు రూ.వెయ్యి నుండి రూ.2000 చెల్లిస్తున్నారు. ఇలా ఒక్కో చేనులో విస్తీర్ణాన్ని బట్టి రోజుల తరబడి గొర్రెల మందలను పొలాల్లోనే ఉంచుతున్నారు. దీంతో గొర్రెల మందలకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. మరోవైపు పశువుల పేడను సైతం కొనుగోలు చేసి పొలాల్లో వేసుకుంటూ భూసారాన్ని పెంచుకుంటున్నారు.

మార్కెట్‌లోకి సేంద్రియ ఎరువులు...

భూసారాన్ని పెంచుకోవడంలో పశువుల ఎరువుతో పాటు చెరువుల్లో గల నల్లమట్టి కూడా బాగా ఉపయోగపడుతుంది. అలాగే శాస్త్రీయ పరిజ్ఞానంతో ఉత్పత్తి చేసిన ఇతర సేంద్రియ ఎరువులు కూడా కొంతమంది రైతులు తమ పొలాల్లో వినియోగిస్తున్నారు. కార్బన్, గోల్డ్, వేప ఎరువు పేర్లతో సేంద్రియ ఎరువులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. యూరియా, డీఏపీ ధరలు విపరీతంగా పెరగడంతో పాటు వాటివల్ల భూములు సారం కోల్పోయి పంటలు దెబ్బతింటున్నాయనే ఉద్దేశ్యంతో రైతులు సేంద్రియ ఎరువులవైపు మొగ్గు చూపుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లోనే సేంద్రియ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తే వ్యర్థాల వల్ల సేంద్రియ ఎరువులను రైతులు తయారు చేసుకొని మరింతగా భూసారాన్ని పెంచుకోనే అవకాశం ఉంది.

రేపు ఛలో సివిల్ సప్లయ్ కమిషనర్ భవన్

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సివిల్ సప్లయి హమాలి కార్మికుల రేట్ల పెంపుకై ఈ నెల 10న చేపట్టే ఛలో కమిషనర్ భవన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో సివిల్ సప్లయి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సివిల్ సప్లయి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అమలు కార్మికుల రేట్లు క్వింటాలుకు ఎగుమతి, దిగుమతి రూ.40 పెంచాలన్నారు. హమాలీ కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి పెంచేందుకు గత ప్రభుత్వాలు జీఓ విడుదల చేశాయని, దాని ప్రకారం జనవరి 2024 సంవత్సరం నుండి హమాలీ కార్మికుల రేట్లు పెంచాలని కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలు గడిచిన పట్టించుకోవడంలేదన్నారు. హమాలీ కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా అందించే నిత్యావసర వస్తువులను పేద బడుగు బలహీన వర్గాలకు అందించడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. హమాలీ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం శ్రమ దోపిడీగురిచేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లిన రేపు మాపు అంటూ కాలయాపన చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఛలో సివిల్ సప్లయి కమిషనర్ కార్యాలయం పిలుపు ఇచ్చినట్లు, పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, నాయకులు దత్తు, దినకర్, శంకర్, సుధాకర్, రాజన్న, సందీప్ పాల్గొన్నారు.

మహిళా రక్షణకే షీం టీం

నవతెలంగాణ-రెబ్బెన

బాలికలు, మహిళాల రక్షణ కోసమే షీ టీంలు పనిచేస్తున్నాయని ఆసిఫాబాద్ షీ టీం ఇన్‌చార్జి సునీత అన్నారు. ఎస్పీ కే .సురేష్ కుమార్ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని కొండపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పనికి వెళ్లే మహిళలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు పని ప్రదేశంలో హింసకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలను షీ టీం సభ్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలపై హింస , ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైమ్‌లకు గురైతే వెంటనే షీటీంను సంప్రదించాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు లేదా షీ టీం ఆసిఫాబాద్ 8712670564కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో దేవానంద్, షీ టీం సభ్యులు శ్రీలత, స్వప్న పాల్గొన్నారు.



గులాబీలో గుబాళింపేదీ..?

- మెజార్టీ పోలింగ్ స్టేషన్లలో డబుల్ డిజిట్‌కే పరిమితమైన బీఆర్ఎస్
- 21 పోలింగ్ స్టేషన్లలో పదిలోపే ఓట్లు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎంతలో ఎంత మార్పు.. జస్ట్ ఆరు నెలల క్రితం వరకు అది ఒక పెద్ద రాజకీయపార్టీ. రాష్ట్ర రాజకీయాన్ని ఒంటి చేత్తో నడిపి తనకు ఎదురే లేదనే రీతిలో ముందుకు సాగిన నాయకత్వం. కాని ఇపుడు పరిస్థితి మారింది. బళ్లు ఓడలవుతాయి.. ఓడలు బళ్లవుతాయనే సామెత ఖచ్చితంగా ఈ పార్టీకి వర్తిస్తుంది. అదే భారత రాష్ట్ర సమితి. 2023 డిసెంబర్‌కు ముందు వరకు రాష్ట్రంలో కానీ జిల్లాలో కానీ ఆ పార్టీ బలమే వేరు. కానీ ఇపుడు ఆ పార్టీని పట్టించుకునే వారే కరువయ్యారు. సిర్పూరు నియోజకవర్గంలో కూడా ప్రస్తుతం ఆ పార్టీ పరిస్థితి ఇదే. 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అప్పటి నుండి సిర్పూరు నియోజకవర్గంలో బీఆర్ఎస్ (అప్పట్లో టీఆర్ఎస్) బలోపేతంగానే ఉంది. 2014 అసెంబ్లీ ఎన్నికలలో ఈ పార్టీ అభ్యర్థి కావేటి సమ్మయ్య ఓటమి చెందినా ప్రత్యర్థి పార్టీ అభ్యర్థికి గట్టి పోటీనే ఇచ్చారు. 2018 ఎన్నికలలో ఈ పార్టీ నుండి పోటీ చేసిన కోనేరు కోనప్ప విజయం సాధించారు. 2024 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్ప 60 వేల ఓట్లు సాధించారు. ఈ ఎన్నికలు జరిగిన ఆరు నెలలకే వచ్చిన లోక్‌సభ ఎన్నికలలో ఈ పార్టీ పూర్తిగా చతికిలపడింది. ఈ ఎన్నికలలో కేవలం 19,840 ఓట్లతోనే సరిపెట్టుకుంది. అసెంబ్లీ ఎన్నికలలో 32.53 శాతం ఓట్లు సాధించిన బీఆర్ఎస్, లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి కేవలం 12.17 శాతం ఓట్లు మాత్రమే సాధించింది.

మెజార్టీ పోలింగ్ స్టేషన్‌లలో 100 ఓట్లు దాటలేదు

సిర్పూరు నియోజకవర్గంలో 320 పోలింగ్ కేంద్రాలుండగా మెజార్టీ పోలింగ్ కేంద్రాలలో బీఆర్ఎస్‌కు వంద ఓట్లు దాటలేదు. 232 పోలింగ్ కేంద్రాలలో బీఆర్ఎస్‌కు ఒక్కో కేంద్రంలో వంద ఓట్లు కూడా రాలేదు. 63 పోలింగ్ కేంద్రాలలో వంద సంఖ్యను దాటింది. 21 పోలింగ్ స్టేషన్‌లలో సింగిల్ డిజిట్‌కే అంటే పదిలోపే ఆ పార్టీకి ఓట్లు పడ్డాయి. కౌటాల మండలంలో 36 పోలింగ్ స్టేషన్‌లకు గాను 31, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 54 పోలింగ్ కేంద్రాలకు గాను 53, కాగజ్‌నగర్ మండలంలో 62 పోలింగ్ కేంద్రాలుండగా 40, పెంచికల్‌పేట్ మండలంలో 21 కేంద్రాలుండగా 14, బెజ్జూరులో 38 కేంద్రాలకు గాను 21, దహెగాం మండలంలో 43 కేంద్రాలకు గాను 29, చింతలమానెపల్లి మండలంలో 33 కేంద్రాలకు గాను 20, సిర్పూరు మండలంలో 33 కేంద్రాలకు గాను 24 పోలింగ్ కేంద్రాలలో బీఆర్ఎస్ అభ్యర్థికి డబుల్ డిజిట్ అంటే వందలోపే ఓట్లు పడ్డాయి.



రాజీమార్గాన కేసుల పరిష్కారం

- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి ఎంవీ రమేష్



ఆసిఫాబాద్ : లోక్ అదాలత్‌లో కేసుల గురించి తెలుసుకున్న జిల్లా జడ్జి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా జడ్జి ఎంవీ రమేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని న్యాయస్థానం భవన సముదాయంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జె. అనంతలక్ష్మితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా సివిల్, క్రిమినల్ కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులతో పాటు, ఎక్సైజ్, సీసీ, ఎస్టీసీ, సైబర్ క్రైమ్‌లతో కలిపి 1045 కేసులకు గాను రూ.17,76,740 మొత్తాన్ని అపరాధ రుసుము రూపంలో వసూలు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో మూడు బెంచ్‌లతో పాటు సిర్పూర్‌లో ఒక బెంచ్ ఏర్పాటు చేశారు. అనంతరం రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించి రాజీపత్రాలను అందించారు.

సిర్పూర్(టి) : కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేల నిర్వహించే లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి అజయ్ ఉల్లం న్నారు. శనివారం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్న కేసులు, బ్యాంకులలో రుణాలు తీసుకొని పెండింగ్‌లో ఉన్న 461 కేసులను ఆయన పరిశీలించారు. కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గం ద్వారా ఇరువురి సమ్మతితో రాజీ కుదిరించి పత్రాలను అందించారు. కేసులను సత్వరమే పరిష్కరించుకోవడంతో సమయంతో పాటు డబ్బులు ఆధా అవుతాయన్నారు.



సిర్పూర్(టి): కక్షిదారులతో మాట్లాడుతున్న సివిల్ కోర్టు న్యాయమూర్తి

బడి బాట ఫలించేనా..?

- బదిలీలతో ఉపాధ్యాయుల రిలీవ్
- కొత్తవారు రావడంతో నూతన నమోదులపై ప్రభావం

సర్కారు బడుల బలోపేతం కోసం చేపడుతున్న బడిబాటకు అవాంతరాలు ఎదురయ్యే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ విడుదల చేయడంతో అనేక మంది బోధకులు ఆయా ప్రాంతాల నుంచి రిలీవ్ అవుతున్నారు. దీంతో పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలనే లక్ష్యానికి ఇబ్బందులు ఎదురవుతాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాత వారు ఉంటే గ్రామస్తులతో పరిచయం ఉండటం..వారి బోధనతీరు కూడా పిల్లల తల్లిదండ్రులకు తెలిసి ఉండటంతో నమోదు సజావుగా జరిగేది. కానీ ప్రస్తుతం కొత్త వారు బడులకు రావడంతో వారిపై తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో పిల్లలను చేర్పిస్తారా లేదా అనేది సందిగ్ధంగా మారింది.

నవతెలంగాణ- కౌటాల

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం బడి బాట కార్యక్రమాన్ని చేపట్టింది. గతంలో బదిలైన ఉపాధ్యాయులు శనివారం రిలీవ్ కావడంతో బడి బాట కార్యక్రమం పడకేసేలాగ పరిణమిస్తుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కొత్త ఉపాధ్యాయులు వచ్చి బాధ్యతలు తీసుకొని పిల్లల కోసం ఊరిలో తిరగాలంటే వారికి ఏమీ తెలియక బడిబాట కార్యక్రమం విజయవంతమవుతుందా అనే సందిగ్ధం నెలకొంది. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు ఊరి పిల్లల తల్లిదండ్రులతో ఎలాంటి సంబంధాలు ఉండకపోవడం బడిబాట కార్యక్రమం పడకేసేలా ఉంటుందని ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే పాత ఉపాధ్యాయులు ఉన్నట్లయితే విజయవంతం అయ్యేదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. పదోన్నతుల ప్రక్రియ చేపట్టితే మండలంలోని ప్రాథమిక పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు వెళితే ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఖాళీలతో నిండిపోతాయని ప్రాథమిక విద్య నీరు గారి పోతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. రాబోయే రెండు నెలల్లో కొత్త డీఎస్సీ పరీక్ష ఉండడంతో అర్హత గల నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. వాలంటీర్ వ్యవస్థను ముందుకు తీసుకువచ్చినా అర్హత కలిగిన వారు చేరడం కష్టమేనని ప్రాథమిక విద్య పడకేస్తుందని చెబుతున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఊరూరు ఇంటింటికి తిరిగి పిల్లలను చేర్పించుకునే పనిలో పడ్డాయి. ప్రైవేటు పాఠశాలకు పంపాలంటే తల్లిదండ్రులకు భారం తప్పదని తల్లిదండ్రులు బాధపడుతున్నారు. ప్రభుత్వం ఇలాంటి సమయంలో బదిలీల ప్రక్రియను చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. విద్యావాలంటీర్లను నియమించాలంటే అభ్యర్థులు కూడా దొరకరని ప్రాథమిక విద్య నీరు గారిపోతోందని పేర్కొన్నారు. పేరుకే జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని పెట్టినప్పటికీ బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉత్సాహం చూపడం లేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేదరికంలో మూలుగుతున్న మాకు ప్రభుత్వ విద్య అందుతుందని ఎంతో ఆశతో ఎదురుచూసినప్పటికీ ఆశ నిరాశ గానే మిగిలిపోతుందని పేర్కొంటున్నారు. నాణ్యమైన విద్యను అందించాలని సమావేశాలు సభలు ఏర్పాటు చేసి చెప్పడమే తప్పా చేసింది ఏమి లేదని పిల్లల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కౌటాలలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



బడి బాటలో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్రంలోని ప్రయివేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం కాగజ్‌నగర్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రయివేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ లేకుండా పోయిందని, విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఏటా పరిమితికి మించి ఫీజులు వసూలు చేస్తున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాలు, దుస్తులు, స్టేషనరీని ప్రయివేట్ విద్యాసంస్థలలో విక్రయించరాదని ఖచ్చితమైన ఆదేశాలున్నా వాటిని లెక్కచేయకుండా విచ్చలవిడి వ్యాపారం చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులందరికీ సరిపడా పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు అందే విధంగా చూడాలన్నారు.

అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

సమావేశం అనంతరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వసాకె సాయికుమార్, కార్యదర్శిగా చాపిలె సాయికృష్ణలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు తుమ్మిడె భీమేష్, సతీష్, సహాయ కార్యదర్శి జాఫర్, నితీష్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్ పాల్గొన్నారు.

నేడే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు





నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేడు జిల్లా వ్యాప్తంగా జరగనుంది. ఇప్పటికే కలెక్టర్ వెంకటేష్ ధోత్రే నేతృత్వంలో పటిష్ట ఏర్పాట్లు చేయగా 2783 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్‌లో 1271 కాగజ్‌నగర్‌లో 1512 అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10.30కు ప్రారంభం కానున్న పరీక్షకు అభ్యర్థులను 9 గంటల నుండి లోపలికి పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. 10 గంటల తర్వాత అభ్యర్థులను లోపలికి పంపించడం జరగదని, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదని తెలిపారు. సీసీ కెమెరాల నిఘాలో నేడు పరీక్ష జరగనుంది. పోలీస్ సిబ్బంది పరీక్ష పకడ్బందీ నిర్వహణకు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే జిల్లా కేంద్రంలోని చైతన్య డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌ను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

పారితోషికం చెల్లించాలని సంతకాలతో నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే పారితోషికం ఎప్పటికప్పుడు చెల్లించాలని డిమాండ్ చేస్తూ టీజేఎల్ఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతకాలు సేకరించి క్యాంపు ఆఫీసర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(టీజేఎల్ఏ) ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో పరీక్ష విధులకు సంబంధించి, ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ మొత్తాన్ని కూడా గతంలో మాదిరిగా చెల్లించాలన్నారు. అయితే ప్రభుత్వానికి తమ ఆవేదన తెలియాలనే ఉద్దేశంతో ప్రతి అధ్యాపకుని సంతకాలు సేకరించినట్లు తెలిపారు. పారితోషికంలో కోతలేకుండా చెల్లించాలన్నారు. పాత విధానాన్ని అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా నాయకులు ప్రభాకర్, బావాజీ, తిరుపతి, మంచిర్యాల జిల్లా నాయకుడు బాపూరావు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

నవతెలంగాణ-జన్నారం



తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకే పంపించాలని మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుంగూరి గోపాల్ అన్నారు. శనివారం మండలంలోని ధర్మారం గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని గ్రామస్థులకు సూచించారు. హెచ్‌ఎం గోపాల్ మాట్లాడుతూ చిన్నారులకు ప్రభుత్వ పాఠశాలలతోనే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు మధ్యాహ్న భోజనం రెండు జతల దుస్తులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కారణాలతో మృతి చెందిన గల్ఫ్ కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. శనివారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ గల్ఫ్ కార్మిక కుటుంబాలు వినతి పత్రం అందించారు. సందర్భంగా గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం మా కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి నాయకులు అమరగొండ తిరుపతి, శేఖర్, లచ్చన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు

● ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మణ్



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతి ప్రజల సౌకర్యార్థం అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు స్థానిక మండల పరిషత్ అధ్యక్షురాలు గోదారి రమాదేవి లక్ష్మన్ తెలిపారు. ముదిగుంట గ్రామ పంచాయతి ప్రధాన రహదారి-బోడగూడెం కాలనీ మధ్య మండల పరిషత్ నిధులు రూ.5లక్షలతో కల్వర్టు నిర్మాణానికి శనివారం స్థానికులతో కలిసి పనులు ప్రారంభించారు. గ్రామ పంచాయతి పరిధి బోడగూడెం కాలని వాసుల రాకపోకలకు వీలుగా కల్వర్టు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎంపీ నిధులు రూ.4 లక్షలతో జడ్పీ రోడ్డు నుండి కొర్వి ప్రసాద్ ఇంటి వరకు సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో బోడగూడెం కాలని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ నుంచి అన్నెవేని మల్లేష్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.3 లక్షలతో సల్లూరి రాజేశ్ ఇంటి నుండి గోగు తిరుపతి ఇంటి వరకు సైడ్రైన్, మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో మిట్టపల్లి గ్రామ పంచాయతి పరిధిలో దుర్గం రవి ఇంటి నుండి దుర్గం రాజబాబు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మొగిలిపాక రాజాగౌడ్, తాళ్లపల్లి రామగౌడ్, గొల్లపల్లి అంజాగౌడ్ గ్రామస్థులు చిప్పకుర్తి రాజం, ఆకుల నర్సయ్య, కొట్టాల మల్లన్న, గుండ సురేష్, బొల్లంపల్లికిరణ్, రాములు, సురేష్, రజినికాంత్, సుమన్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారం అందుకోనున్న చరణ్

నవతెలంగాణ-నస్పూర్



పదవ తరగతి పరీక్ష ఫలితల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిలువేరి చరణ్ తేజ 10 జీపీఏ సాధించి ప్రతిభా పురస్కారం అందుకోనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడికాల రామన్న తెలిపారు. సోమవారం శ్రీహరి హర కళాభవన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా పురస్కారం అందుకోనున్నాడని తెలిపారు. అలాగే మేధా ట్రస్ట్ ద్వారా నిర్వహించిన స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించి 2 సంవత్సరాల ఇంటర్మీడియట్, 4 సంవత్సరాల ఇంజనీరింగ్ విద్యకు అర్హత సాధించాడని తెలిపారు. ఈ సందర్భంగా విద్యాధికారి యాదయ్య అభినందనలు తెలిపారు.

సీహెచ్‌పీ గనిలో రక్షణపై అవగాహన



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

సేఫ్టీ జీఎం గురువయ్య ఆదేశానుసారం శనివారం స్థానిక సీహెచ్‌పీ గనిలో ప్రత్యేక రక్షణ డ్రైవ్ కార్యక్రమంను ఏరియా రక్షణాధికారి రవీందర్, ఇంజనీర్ నాగరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 నుండి ఆక్సిడెంట్స్ ఎక్కువగా జూన్ నెలలో జరుగుతున్న నేపథ్యంలో రక్షణపై ప్రత్యేకంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. రక్షణలో ఆట్టిట్యూడ్, బిహేవియర్, కల్చర్, డిసిప్లిన్ వీటిని సక్రమంగా పాటిస్తే రక్షణలో జీరో హార్మ్ సాధించవచ్చని తెలిపారు. రక్షణ ఇంటినుండే మొదలవ్వాలని స్టార్ట్ ఎర్లీ, డ్రైవ్ స్లోలీ, రీచ్ సేఫ్లీ విధానం బాగుంటుందని అన్నారు. రక్షణ అనేది ఒక మెరుగైన జీవనశైలి ఒక పద్ధతితో జీవిస్తే దానిని చూసి మన పిల్లలకు మనం గైడ్ చేసినవారిమి అవుతామని, మనం ఆరోగ్యంగా లేకుంటే, చనిపోతే మన కుటుంబం బజారునపడి జీవితం అల్లకల్లోలంగా మారుతుందనే విషయాన్ని మరువకుండా ఒక బాధ్యతతో రక్షణను పాటిద్దామని, ప్రమాదరహిత సింగరేణిగా మారుద్దామని, అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించి కార్మికులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌పీ గని ఇన్‌చార్జి, ఇంజనీర్ చంద్రమౌళి, ఈఈ అనుదీప్, పీఏ నరేంద్ర, శ్రీకాంత్, సూపర్ వైజర్లు కె శ్రీనివాస్, వేణు జె శ్రీనివాస్, శంకరావు పాల్గొన్నారు.

వాస్తవ లాభాలను ప్రకటించి 35 శాతం వాటా చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

2023-24 ఆర్థిక సంవత్సరానికి సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి అందులో 35 శాతం వాటాని కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టెం లక్ష్మణ్, ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఆర్థిక సంవత్సరం గడిచి మూడు నెలలు అవుతున్నా ఇప్పటివరకు సీఎంపీఫ్ స్లిప్పులను సింగరేణి యాజమాన్యం ఉద్యోగులకు ఇవ్వలేదని, అంతేకాకుండా సిఎంపీఫ్ డిజిటలైజేషన్ చేస్తామని చెప్పి ఇంతవరకు ఆ ప్రక్రియని మొదలు పెట్టలేదన్నారు. అంతే కాకుండా వివిధ కారణాల ద్వారా సీఎంపీఎఫ్‌లోన్ అప్లై చేసుకున్న ఉద్యోగులకు వెంటనే అమలు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం వెంటనే అమలు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇన్కమ్ టాక్స్ సంబంధించిన పత్రాలను యాజమాన్యం వెంటనే ఇవ్వాలని, అంతేకాకుండా ఇన్కంటాక్స్ ఫైలింగ్‌ను అన్ని గనులు డిపార్టుమెంట్లలో యాజమాన్యమే చేయాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయంలో కొనసాగుతున్న అన్నదానం

తాండూరు : బెల్లంపల్లి పట్టణంలోని కాళోజీ గ్రంథాలయంలో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగ యువతి యువకులకు శని, ఆదివారాల్లో నిర్వహించే ఉచిత అన్నదాన కార్యక్రమం శనివారం కొనసాగింది. వెంకట కృష్ణారెడ్డి సహకారలతో మాజీ కౌన్సిలర్ వంశీ కృష్ణారెడ్డి, పద్మరెడ్డి జ్ఞాపకార్ధంగా అమ్మ ఒడి ఎన్జీఓ ఈ కార్యక్రమాన్ని వారానికి రెండు రోజులు కొనసాగిస్తోంది. ఈ కార్యక్రమంలో అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల మధుకర్, అమ్మ ఒడి అన్నదాత ప్రాజెక్ట్ బ్రాంచి మేనేజర్ సభ్యులు హనుమాండ్ల సువర్ణ, మల్లక్క, నారాయణ, గన్నెవరం తిరుమలచారి, దాసరి లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించని ప్రభుత్వాలు

● ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.మహేశ్వరి



నవతెలంగాణ-మంచిర్యాల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం అయ్యాయని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.మహేశ్వరి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) మంచిర్యాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం దాసరి రాజేశ్వరి అధ్యక్షతన శనివారం చార్వాక ట్రస్ట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దీనివలన మహిళలకు దేశంలో రక్షణ లేకుండా పోయిందన్నారు. నిత్యం ఏదో ఒక్క ప్రాంతంలో మహిళలపై, బాలికలపై ఘోరాలు జరుగుతున్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న చట్టాలు కేవలం పేపర్లకే పరిమితం ఉన్నాయన్నారు. మహిళ శ్రమకు కనీసం విలువకుడ ఇవ్వడం లేదని అన్నారు. మహిళలు జిల్లాలో అనేక మోసాలకు గురౌతున్నారన్నారు. వరకట్న వేదింపులతో చంపబడుతున్నరని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వైద్యం కూడ మహిళకు అందడం లేదన్నారు. ప్రసూతి మరణాలు పెరుగుతున్నాయని, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మంచిర్యాల జిల్లాలో ఐద్వా సంఘం పని చేస్తుందన్నారు. అనంతరం 19 మందితో నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారన్నారు. గౌరవధ్యక్షురాలిగా దాసరి రాజేశ్వరి, అధ్యక్ష్యురాలుగా పోతు విజయ, ప్రధాన కార్యదర్శిగా సంకే రజిత దేవి, కోశాధికారిగా సంకే శ్రావణిలు నియామకం అయ్యారు. ఉపాధ్యక్షులుగా బోగే నాగజ్యోతి, సోమిడి సమ్మక్క, సంకే రాజకుమారి, భవాని, సహాయ కార్యదర్శులుగా వేమునూరి నిర్మల, సామల ఉమరాణి, రాభీయ, రఫియ, జిల్లా కమిటీ సభ్యులుగా తుమ్మ రేణుక, బోండ్ల సరిత, బోయిరే రమదేవి, త్రివేణి, సిడం సమ్మక్క, మధునక్క, సరితలు ఎన్నికయ్యారు.

దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల అరెస్టు

● బంగారం, వెండి, రూ.2.4 లక్షల నగదు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన డీసీపీ అశోక్ కుమార్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకున్నట్లు డీసీపీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నిందితుని వద్ద రూ.5 లక్షలు విలువ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గత కొద్ది నెలలుగా మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల్లో, జగిత్యాల జిల్లాలోని పలు మండలలో జల్సాలకు అలవాటుపడ్డ నిందితులు సులువుగా డబ్బులు సంపదించుకోవటానికి రాత్రి సమయంలో ఇంటి బయట పడుకొని ఇంటికి తాళం వేసి ఉన్న ఇండ్లను లక్ష్యం చేసుకుని దొంగతనాలకు పాల్పడ్డాడు. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్, హాజీపూర్ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో నిందితులను పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శనివారం మధ్యాహ్నం హాజీపూర్ మండలం గుడిపేటలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లే దారి వద్ద ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా వారిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఖంభంపాటి యేసుబాబును అదుపులోకి తీసుకొనగా గత ఆరు నెలలుగా హాజీపూర్ మండలం, లక్షెట్టిపేట మండలంలోని పలు ఇండ్లలో, జగిత్యాల జిల్లాలలోని పలు మండలాలలో దొంగతనం చేసినట్లు తెలిపారు. దొంగతనం చేసిన బంగారం, వెండి ఆభరణాలను మహారాష్ట్రకు చెందిన లిముమ్మడ్వార్ రాహుల్ అనే వ్యక్తికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. హాజీపూర్ పోలీసులు ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకోని వారిని తనిఖీ చేయగా వారి వద్ద నుండి 2 తులాల పావు బంగారం, 15 తులాల వెండి పట్టీలు, రూ.2,44,660 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఉచిత చేప మందుకు విశేష స్పందన

నవతెలంగాణ-దండేపల్లి



మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా (ఉబ్బసం, దమ్ము, దగ్గు) వ్యాధిగ్రస్తులకు వేసే ఉచితన చేప మందు పంపిణీకి విశేష స్పందన లభించింది. దండేపల్లికి చెందిన మాడిశెట్టి ప్రేంరాజ్-భూలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. చేపమందు కోసం శుక్రవారం మధ్యాహ్నం నుంచే వేలాది మంది జనం మండలకేంద్రానికి చేరుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలే కాకుండా మహారాష్ట్ర అంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా వందలాది ఆస్తమా వ్యాధిగ్రస్తులు వచ్చి చేపమందు తీసుకున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. దాదాపు 15 వేల మందికి పైగా జనం రావడంతో రద్దీ ఏర్పడింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రేంరాజ్ మాట్లాడుతూ ఉబ్బసం, ఆస్తమ, దమ్ము, దగ్గు, జలుబు, పక్షవాతం, నడుం నొప్పులకు వంటి రోగాలకు బాగా పనిచేస్తుందని ఏట చేప మందు ప్రసాదాన్ని స్వీకరించేందుకు భారి సంఖ్యలో జనాలు రావటం వారికీ స్వచ్ఛందంగా చేప మందు ప్రసాదం అందించడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. రెండు రోజుల ముందే దండేపల్లికి చేరుకున్న వ్యాధిగ్రస్తులకు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. దండేపల్లి ఏఎస్ఐ పాల్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, కార్యక్రమ నిర్వహకులు నరేడ్ల సత్తన్న, గుండ రవీంధర్, పసుపునూటి తిరుపతి, కట్కూరి రాజయ్య, తోపాటు సమారు 20 మంది వలంటీర్లు చేపమందు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-మంచిర్యాల

హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు శనివారం పరిశీలించారు. వైద్య కళాశాల ప్రాంగణంలోని బాల, బాలిక వసతి గృహాలతో పాటు వైద్య కళాశాల భవనాల నిర్మాణాలను పరిశీలిస్తూ నిర్మాణ పనుల వివరాలతో పాటు వైద్య కళాశాలలోని రెండు వసతి గృహాల్లోని గదుల సంఖ్య, విద్యార్థుల పరిమితి, వైద్య కళాశాలలో ఉన్న ల్యాబ్లు, తరగతి గదులు, సెమినార్ గదులు, మ్యూజియం, అనాటమీ తదితర విభాగాలకు సంబంధించిన నిర్మాణ పనులను సమీక్షించారు. రోడ్లు, భవనాల శాఖా మంచిర్యాల డీఈ భావ్ సింగ్, కళాశాల నిర్మాణ పర్యవేక్షణ జేఈ అనూషా, కళాశాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావులు ఎమ్మెల్యేకు పూర్తి వివరాలను తెలియజేశారు. కళాశాల వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసి అప్పగిస్తామని అధికారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 205 కోట్లతో చేపడుతున్న వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో పాటు పారదర్శకంగా చేపట్టేలా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. దాదాపు 31 ఎకరాల్లో 25 ఎకరాల వరకు వైద్య కళాశాల భవ నిర్మాణ పనులు జరుగుతుండగా భవిష్యత్తులో వైద్య కళాశాల సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు తూముల నరేశ్, తోట రవి, పూస్కూరి శ్రీనివాసరావు, గోనె సతీష్‌రావు, నాయిని సురేందర్, రాసమల్ల శ్రీనివాసగౌడ్, బొడ్డు శంకర్, రాజమౌళి, శ్రీనివాస్, కోటె సత్తయ్య, దొమ్మటి సత్తయ్య, బాపు, కళాశాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావు పాల్గొన్నారు.

నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత



నవతెలంగాణ-మంచిర్యాల

హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులో శనివారం నిషేధిత నకిలీ పత్తివిత్తనాలను టాస్కోర్స్, హాజీపూర్ పోలీసులు పట్టుకుని రవాణా చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి మంచిర్యాల వైపు ద్విచక్ర వాహనంపై రెండు బ్యాగులతో వస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా ఆ బ్యాగుల్లో రూ.1 లక్ష 80 వేల విలువ గల 60 కిలోల ప్రభుత్వ నిషేధిత నకిలీ పత్తివిత్తనాలను గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై లచ్చన్నలు నకిలీ పత్తివిత్తనాలను రవాణా చేస్తున్న ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారించగా కాసీపేట మండలం తుంగగూడెంకు చెందిన గుండవేణి రాజశేఖర్, ధర్మారావుపేటకు చెందిన ముచ్చెర్ల సంపత్‌గా గుర్తించారు. వీరు జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన షాబుద్దీన్ అనే వ్యక్తి నుంచి తక్కువ ధరకు ఈ నకిలీ పత్తివిత్తనాలు కొనుగోలు చేసి జిల్లా పరిధిలోని అమాయక రైతులకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. నకిలీ పత్తివిత్తనాలను రవాణా చేసేందకు వినియోగిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను, 60 కిలోల పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకుని హాజీపూర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్కఫోర్స్ సీఐ తెలిపారు.

క్రీడల్లో జిల్లాను ముందంజలో నిలపాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

క్రీడా రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో రాణించి మంచిర్యాల జిల్లాను ముందంజలో ఉంచాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గ్రీన్సిటీలో గల మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలను అదనపు కలెక్టర్ బి రాహుల్‌తో కలిసి ప్రారంభించి బ్యాడ్మింటన్ ఆడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ క్రీడా రంగంలో తీర్చిదిద్దడం అభినందనీయమని అన్నారు. జిల్లా క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. అనంతరం జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్న క్రీడాకారులను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, ముఖ్య సలహాదారు గాజుల ముఖేష్ గౌడ్, కోశాధికారి సత్యపాల్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు ఉదయం 10 గంటలలోపు ఉండాలి

నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో నేడు జరుగనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అభ్యర్థులు ఉదయం 10 గంటల లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని తెలిపారు. 10 గంటల తరువాత పరీక్షా కేంద్రంలోనికి అనుమతి ఉండదని వివరించారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు అందించే వ్యక్తిగత ఓఎంఆర్ షీట్లపై సంబంధిత అభ్యర్థుల వివరాలు ముద్రించి వస్తాయని, అట్టి వివరాలతో పాటు, పరీక్ష నియమ, నిబంధనలను సరి చూసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు పాటించవలసిన నియమాలను హాల్ టిక్కెట్లపై కూడా ముద్రించడం జరిగిందని, అభ్యర్థులు ఈ నియమాలను తెలుసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రంలో 9.30 గంటలకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రారంభించడం జరుగుతుందని, బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా ఏ అభ్యర్థి కూడా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్ళరాదని, ఒకవేళ వెళ్ళినట్లయితే అట్టి అభ్యర్థి ఓఎంఆర్ షీట్ పరిగణలోకి తీసుకోబడదని, బయోమెట్రిక్ తీసుకునేందుకు అభ్యర్థుల చేతివేళ్ళపై ఎలాంటి మెహందీ, తాత్కాలిక టాటూస్, ఇతరత్రా ఉండరాదని తెలిపారు.

పోలీస్ సిబ్బందికి ఏసీపీ సూచనలు

నవతెలంగాణ-మందమర్రి



గ్రూప్-1 పరీక్ష విధులకు హాజరయ్యే పోలీస్ సిబ్బందికి బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పలు సూచనలు చేశారు. జూన్ 9వ తేదీన జరుగు గ్రూప్-1 పరీక్షల దృష్ట్యా మందమర్రి సర్కిల్ పరిధిలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వర్తించబోయే పోలీస్ సిబ్బందికి మందమర్రి పోలీస్‌స్టేషన్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్‌లకు అనుమతి లేదని, పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి పంపించాలని సిబ్బందికి సూచించారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందని కాబట్టి పరీక్ష కేంద్రాల దగ్గరలోని జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని, నలుగురికి మించి జనాలు ఒకే చోట గుమికూడి ఉండరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేప మందు పంపిణీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని బీరవెల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మృగశిర కార్తెను పురష్కరించుకుని సగ్గం కృష్ణ సోదరులు ఉబ్బస వ్యాధిగ్రస్తులకు ఉచిత చేప ప్రసాదం పంపిణీ చేశారు. ఉదయం నుంచి నిర్మల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి రెండు వేల మంది వ్యాధిగ్రస్తులు తరలివచ్చి చేప ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా చేప మందు కోసం వచ్చిన వారికి గ్రామాభివృద్ధి కమిటీ



ఆధ్వర్యంలో తాగునీరు, టెంటు కుర్చీలు ఏర్పాటు చేయగా, స్థానిక ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పంచాయతీ కార్యదర్శి మోహినొద్దిన్, కారోబారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రానికి చెందిన బీజేపీ కార్యకర్త రాజశేఖర్ తండ్రి కొందపురం భూమన్న మాజీ సర్పంచ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావ్ పటేల్ శనివారం గ్రామానికి చేరుకొని వారి కుంటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నతీకరణ పట్ల పీఆర్టీయూ హర్షం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో తెలుగు పండిత్, హిందీ పండిత్, పీఈటీ పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌గా ఉన్నతీకరణ పట్ల పీఆర్టీయూ జిల్లా పక్షన హర్షం వ్యక్తం చేస్తున్నట్టు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్ యాదవ్, జాధవ్ ప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 25 సంవత్సరాల పాటు ప్రమోషన్‌కు నోచుకోకుండా కోర్టు కేసుతో నిలిచిపోయిన పోస్టులను ప్రభుత్వం చొరవతో నేడు ఉన్నతీకరించడం విషయాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వానికి ఒప్పించి మార్గదర్శకాలు విడుదల చేయంచిన పీఆర్టీయూ సంఘ వ్యవస్థపాక అధ్యక్షులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ధన్యవాదాములు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూమీడియం, పీఈటీలను కలిపి మొత్తం 245 పోస్టులను ఉన్నతీకరణ చేయడం జరిగిందని పేర్కొన్నారు.

ప్రయివేటు కళాశాలల అనుమతి రద్దు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో ఉన్న ఆదిత్య కళాశాల, సన్‌రైస్ హబ్ రెండు ప్రయివేటు కళాశాల అనుమతి రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్ అన్నారు. శనివారం జిల్లా ఇంటర్ బోర్డు అధికారి రవీందర్ కుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో ర్యాంకుల పేరుతో వ్యాపారం చేయడం, అనుమతి లేని చోట కళాశాల నిర్వహించడం, సామాన్య ప్రజలకు మోసం చేయడమేనని అన్నారు. అగ్నిమాపక చట్టం 2021 ప్రకారం కళాశాల నిర్వహించడం లేదన్నారు. కళాశాల పరిసరాలలో అగ్నిమాపక వాహనం నాలుగు దిశలలో ప్రవేశించడానికి ఖాళీ స్థలం లేదన్నారు. ఈ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీరాజ్, సాయికిరణ్, అశోక్ పాల్గొన్నారు.

సూపర్ వాస్మోల్ తాగి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సూపర్ వాస్మోల్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అంకోలి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఏఎస్సై సునిత తెలిపిన వివరాల ప్రకారం.. మెలితపు రమ(46) ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం సూపర్ వాస్మోల్ తాగి పడిపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు. మృతురాలుకు భర్త, పిల్లలు ఉన్నారు.

గుట్కా పట్టివేత

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా బైక్‌పై తీసుకెళ్తున్న రూ.32 వేల విలువగల గుట్కాను పట్టుకున్నట్టు ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రం నుంచి శ్యాంపూర్ గ్రామానికి చెందిన ఆతిక్ దావూద్ దుంగే బైక్‌పై గుట్కా తరలిస్తుండగా పట్టుకొని ఆతనిపై కేసును నమోదు చేసినట్టు తెలిపారు.

అనుమతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-బోథ్

మండలంలోని కుచులాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నూతనంగా నిర్మిస్తున్న ప్రయివేట్ పాఠశాలకు గ్రామపంచాయతీ నుంచి ఎటువంటి అనుమతి లేకుండా భవన నిర్మాణాన్ని నిర్మించి ప్రారంభించిందని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మున్సిఫ్ శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు గ్రామపంచాయతీ అధికారులకు అడుగగా ఆ భవనానికి ఎటువంటి అనుమతి లేదని అది అక్రమ నిర్మాణమని తెలియజేశారు. అక్రమ నిర్మాణం జరుగుతున్న ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని అన్నారు. అడ్మిషన్లు చేపడుతున్న ప్రయివేట్ పాఠశాల యాజమానులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీ సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఢిల్లీ పర్యటనలో భాగంగా ఓ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శనివారం ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేతో చంద్రబాబు ఆప్యాయంగా మాట్లాడారు. గతంలో టీడీపీలో చేసిన అనుభవాలను ఇరువురు గుర్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి భారీ మెజార్టీతో విజయం సాధించడం పట్ల నగేష్‌కు చంద్రబాబు అభినందనలు తెలియజేశారు.

పోడు రైతులు, ఫారెస్టు అధికారులకు వాగ్వాదం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఓ వైపు దశాబ్దాలుగా పట్టాలు కలిగి ఉన్నామని సాగులో ఉన్న రైతులు, మరో వైపు ఇది ఫారెస్టు భూమే అంటూ ఫారెస్టు అధికారులు పట్టుబడుతుండడంతో పోడు భూముల సమస్య సాగుతోంది. వానకాలం పంటల సీజన్ ప్రారంభం కాగానే అటవీ అధికారులు అడ్డుకుంటూ నానా ఇబ్బందులు గురిచేస్తున్నారని పలువురు రైతులు ఆరోపించారు. శనివారం కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ గొంది శివారులోని పోడు భూముల సాగుకు రైతులు వెళ్లారు. ఇదే సమయంలో అటవీశాఖ ఎఫ్ఆర్ఓ రమాదేవి, డీఆర్వో పాటేకర్, సిబ్బంది ఇది ఫారెస్టు భూమి అని, హద్దులు ఏర్పాటు చేస్తామని అక్కడికి చేరుకున్నారు. దీంతో ఫారెస్టు అధికారులు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకవైపు రైతులు, మరోవైపు అటవీ అధికారులు గంటల తరబడి భీష్మించుకొని అక్కడే



కూర్చుకున్నారు. ఒక దశలో రైతులు రోడ్డుపై బైటాయించారు. దశాబ్దాలుగా తాము రెవెన్యూ పట్టాలు కలిగి తమ తాతల కాలం నుంచి సాగులో ఉన్నామని రైతులు తెలిపారు. బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి అక్కడికి చేరుకొని సమస్యను తెలుసుకున్నారు. 2005లోనే పోడు భూములపై పట్టాలు కలిగిన రైతులు ఏటా రైతుబంధు, బ్యాంకుల్లో పంటరుణాలు పొందుతున్న రైతులను అటవీ అధికారులు అడ్డుకోవడం సరైంది కాదన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పోడు రైతుల పక్షాన ఆందోళన చేపడ్తామన్నారు. గంటల తరబడి నిరీక్షించిన రైతులు భూముల్లోకి వెళ్లే ప్రయత్నం చేయగా స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడి చేరుకొని రైతులను సముదాయించారు. రెవెన్యూ, అటవీశాఖల మధ్య ఈ సమస్య ఉన్నందున ఈ నెల 10న తహసీల్దార్ కార్యాలయానికి రావాలని ఆయన సమక్షంలో విచారణ చేపట్టి సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవాలని సీఐ సూచించారు. దీనికి రైతులు, ఫారెస్టు అధికారులు అంగీకరించడంతో వివాదం సద్దుమణిగింది.



వాడీవేడిగా సర్వసభ్య సమావేశం



నవతెలంగాణ-ఉట్నూర్

అధికారులు ప్రజలకు ఇబ్బందులు పెట్టకూడదనీ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ, విద్యుత్‌శాఖ, అటవీ శాఖ అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. నీరు లేని గ్రామాలు మండలంలో చాలా ఉన్నాయని, అధికారులు స్పందించి ప్రజలకు నీరు అందేలా చూడాలని అన్నారు. ప్రజలు విద్యుత్ కోసం డీడీలు కట్టిన కూడా విద్యుత్‌శాఖ అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పడం మంచిది కాదని, ఇల్లుకి అవసరం కోసం ఇసుక తీసుకొని వస్తే అటవీశాఖ అధికారులు ట్రాక్టర్‌నీ పట్టుకొని రూ.40వేలు లంచం తీసుకోవడం మంచిది కాదని, అధికారులు తమ తీరును మార్చుకోవాలని, లేనియెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలో సాగు చేస్తున్న భూమిని రైతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇంద్రక్రాంతి పథకంలో ఉన్న వీఓలు అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేసుకుంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్, ఎంపీటీసీలు ఏం చేసుకోవాలని అన్నారు. వీఓలు సంఘంలో చేసే పనులు మాత్రమే చేసుకోవాలని కోరారు. భగీరథ నీరు చిన్న గంగాపూర్‌లో గత ఐదు సంవత్సరాలుగా పూర్తి అయిన కూడా ఇప్పటి దాకా నీరు అందలేదని, ఎంపీటీసీ ఆరోపించారు. శ్యాంపూర్ గ్రామంలోని పోచమ్మ గల్లిలో కూడా నీరు రావడం లేదని వైస్ ఎంపీపీ బాలాజీ ఏఈపై తిరగబడ్డారు. దళారి వ్యవస్థను వ్యవసాయ అధికారులు అరికట్టాలని కోరారు. ఏఈఓలు రైతు బీమా వచ్చిన రైతుల నుంచి వసూలు చేయడం సరి కాదని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు ఉంటే ప్రజలు లైన్ మెన్‌లకు ఫోన్‌లు చేస్తే లేపడం లేదని, ఫీల్డ్‌కి వెళ్లడం లేదని ప్రజల దగ్గర నుంచి ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే ప్రజల సమస్యలను పరిష్కారం చేయాలనీ అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ పంద్ర జేవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీఓ కోఆప్షన్ మెంబర్ ప్యాక్స్ చైర్మెన్ ఎంపీటీసీ, ఎంపీఓ, అగ్రికల్చర్ ఏఓ, విద్యుత్, అటవీ, ఏటీడీఓ గ్రామపంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

హామీ ఇచ్చారు.. మాట నిలబెట్టుకున్నారు..

- పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ భూమిపూజ



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, పొద్దు పొడుపు బొజ్జన్న అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టి నాడు మాటిచ్చి, నేడు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి మాటను నిలబెట్టుకున్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని బోయవాడ, శాంతినగర్, పాత ఉట్నూర్, ఎత్మాసూర్‌నగర్ కాలనీలలో డ్రైనేజీ, సీసీ రోడ్డు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని, చెప్పిందే చేస్తుందని, చేసేదే చెప్తుందని అన్నారు. పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేస్తామన్నారు. నియోజకవర్గంలోని నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని అన్నారు. పేదింటి బిడ్డయిన తనకు ఎమ్మెల్యేగా గెలిపించినందుకు ఈ ప్రాంత ప్రజల రుణాన్ని తీర్చుకుంటానని తెలిపారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే తీరు పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కేశవపట్నం గ్రామస్తులు

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ని శనివారం కేశవపట్నం గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. కేశవపట్నం గ్రామం నుంచి గైద్‌పల్లి గ్రామానికి నడవడానికి సరైన రహదారి లేదని, సరైన రహదారి లేకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, రహదారి వేయించాలని కోరారు. అంతేకాకుండా అన్యాయంగా మా వ్యవసాయ భూములలో తవ్వకాలు జరుపుతున్నారని ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు ఉన్నా కూడా అన్యాయంగా తవ్వకాలు జరుపుతున్నారని తెలిపారు. శుక్రవారం జరిగిన విధంగా మళ్లీ జరగకూడదంటే మాకు శాశ్వత



పరిష్కారం చూపించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, మీ వ్యవసాయ భూములకు ఎటువంటి అడ్డంకులు రాకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలో బీజేపీకి ఓటు వేసిన ప్రజలకు ఆ పార్టీ నాయకులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నరేంద్ర మోడీ మూడవసారి ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా పట్టణ పరిధిలో జరుపుకోబోయే సంబరాల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో క్యాతనపల్లి పరిధిలోని అన్ని వార్డుల్లో బీజేపీ అభ్యర్థులు పోటిలో ఉంటారని వారిని గెలిపిస్తే మున్సిపాలిటీ అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు అరుముళ్ళ పోషం, పట్టణ అధ్యక్షులు వేముల అశోక్, ప్రధాన కార్యదర్శులు కట్ట ఈశ్వర చారి, మాసు సత్యనారాయణ, సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, ఠాగూర్ ధన్‌సింగ్, దండు రాజేందర్. పట్టణ ఉపాధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి ఓరుగంటి సాయి కృష్ణ, వరముని లక్ష్మణ్, దేవేందర్, నరసయ్య పాల్గొన్నారు.

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరనిలోటు



నవతెలంగాణ-జన్నారం

రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య అన్నారు. జన్నారం ప్రెస్ క్లబ్ ధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్రిక రంగంలో రామోజీరావు చేసిన సేవలు మరువన్నారు. పత్రికా రంగంలో సమాజ సేవలో సినిమా రంగంలో ఎంతోమందికి జీవనోపాధిని కల్పించిన మహా వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిటిమల భరత్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు తాళ్ళ పెల్లి రాజేశ్వర్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి గాజుల లింగన్న గౌడ్, ఉపాధ్యక్షుడు ఎంబడి మల్లేశం, గౌరవ అధ్యక్షులు మండ పెల్లి కాంతయ్య ప్రచార కార్యదర్శి జాడి వెంకట్ నేతకాని సంఘం చెన్నూరం మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్ జిల్లా నాయకులు బొడ్డు శంకర్ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు..

రెబ్బెన : పాత్రికేయ రంగానికి రామోజీరావు అందించిన సేవలు మరవలేనివని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవన ఆవరణలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక, కర్షక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడంలో దేశంలోనే రామోజీరావు పాత్ర అత్యంత కీలకమని గుర్తు చేశారు. ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్య విజయాలు సాధించిన ఆయన మృతి ఆవేదన గురి చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు అరికిల్ల స్వామి, నాయకులు శంకర్, నందు, గుండేటి సమ్మయ్య పాల్గొన్నారు.

కలం యోధుడికి కాంగ్రెస్ నివాళి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రముఖ మీడియా అధినేత, రామోజీ గ్రూప్ చైర్మన్ రామోజీరావు మృతి పట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నివాళి అర్పించాయి. ఈ సందర్భంగా రామోజీరావు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, పార్టీ నాయకులు జక్కయ్య, మోహన్ ప్రధాన్, బాలేష్, వెంకన్న, శ్రీకాంత్, సత్యక్క, తిరుపతి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : రామోజీ గ్రూప్ ఆఫ్ చైర్మెన్ చెరుకూరి రామోజీరావు మృతికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ రామోజీరావు పత్రికా రంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి చాలా మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు వేముల అశోక్, ప్రధాన కార్యదర్శి మాసు సత్యనారాయణ, సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, ఠాగూర్ దన్‌సింగ్, దండు రాజేందర్, పట్టణ కార్యదర్శి ముత్యాల ఎల్లేష్, మోత్కూరి దేవేందర్, జంగంపల్లి చంద్రమౌళి పాల్గొన్నారు.